కోదండరామ స్వామి ఆలయంలో పూజలు



శ్రీకోదండ రామస్వామి ఆలయంలో పూజల్లో ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి

హబ్సిగూడ: హబ్సిగూడలోని శ్రీకోదండ రామ స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి బంగారు కిరీటం అలంకరణ పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షులు యాదవరెడ్డి, మల్లారెడ్డి, కొండల్‌రెడ్డి, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, అరవింద్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, రాజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఆగిరెడ్డి, శ్రావణ్‌రెడ్డి, సుధాకర్, గిరిబాబు, ఉపేందర్‌రెడ్డి, గణేష్‌నాయక్, ధర్మేందర్‌నాయక్, పవన్, విజయ్, రమేష్‌నాయక్, రాజు, బాబురావు, రామునాయక్, షబ్బీర్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ నవమికి ఆలయాలు ముస్తాబు



విద్యుత్ దీపాలతో అలంకరించిన దేవాలయం



దేవాలయంలోని మూలవిరాట్‌లు, ఉత్సవమూర్తులు

మల్కాజిగిరి: శ్రీరామ నవమి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించడానికి ఆలయాల వద్ద కాలనీల్లో నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఓల్డ్ మల్కాజిగిరిలోని పురాతన రామమందిరాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆనంద్‌బాగ్ వేంకటేశ్వర స్వామి దేవాలయం, మారుతీనగర్ ఆంజనేయస్వామి దేవాలయం తదితర ఆలయాల వద్ద రాములవారి కల్యాణోత్సవానికి చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

బోడుప్పల్: క్రమశిక్షణతో కూడిన విద్యను విద్యార్థులకు బోధించాలని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం ఈ విద్యా సంవత్సరం క్రమశిక్షణ, సమయపాలన, స్కూల్ యూనిఫామ్ ధరించిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి ప్రశంసా పత్రాలను ఆయన చేతులమీదగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో పాటు గొప్ప నాయకత్వ లక్షణాలను అలవర్చుకున్నారన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రతిభ చాటుతున్నారన్నారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగేందుకు ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రుల కృషి ప్రశంసనీయం అన్నారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి



బోడుప్పల్: 18 డివిజన్ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ పులకండ్ల హేమలతా జంగారెడ్డి అన్నారు. 18వ డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో అభివృద్ధి పనులపై జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ముఖ్యంగా తాగునీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు వెల్లడించారు. డివిజన్‌లో మిగిలిపోయిన పనులను దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు కార్పొరేటర్ దంపతులను సత్కరించారు.

రోడ్డు దాటుతున్న మహిళను ఢీకొట్టిన ఆటో

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి

ఉప్పల్: బంధువులు చనిపోతే అంత్యక్రియలకు హాజరై తిరుగు ప్రయాణంలో ఆటో ఢీకొని మహిళ దుర్మరణం పాలైన ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యాదాద్రి జిల్లా కురారం గ్రామానికి చెందిన జూకంటి బాలమ్మ(55) కందుకూరు మండలం ఆకుల మైలారం గ్రామంలో ఈ నెల 15న జరిగిన బంధువుల అంత్యక్రియలకు హాజరైంది. ఉప్పల్ నుంచి యాదాద్రి జిల్లా స్వగ్రామానికి వెళ్తుండగా ఉప్పల్‌లో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొట్టడంతో తీవ్రంగా గాయాలపాలైంది. ఆమెను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. కుమారుడు కనకయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభం

మల్కాజిగిరి: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆనంద్‌బాగ్‌లో బుధవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నారు. మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి పార్టీ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి తదితరులు హాజరుకానున్నారు.

యూత్ కాంగ్రెస్ జాయింట్ సెక్రటరీగా సంతోష్‌రెడ్డి



నియామక ఉత్తర్వులను అందుకుంటున్న మామిడాల సంతోష్‌రెడ్డి

మల్లాపూర్: యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా నాచారం డివిజన్ వీఎస్టీ కాలనీకి చెందిన మాజీ సైనికుడు, మామిడాల సంతోష్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం నియామక ఉత్తర్వులను యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ సంతోష్‌రెడ్డి ఆర్మీలో పనిచేశాడని, మూడు సంవత్సరాలుగా సోషల్ వర్కర్‌గా సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు అభినందించారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా



నాచారంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం నాచారం పార్టీ కార్యాలయంలో నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ ఆధ్వర్యంలో ఎన్నికల సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి హాజరై మాట్లాడారు. నాచారం డివిజన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పనిచేస్తారన్నారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అధ్యక్షుడు మేకల ముత్యంరెడ్డి, మేడాల మల్లికార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు. మల్లాపూర్ ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ ఫంక్షన్‌హాల్‌లో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అధ్యక్షతన మంగళవారం సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై ఎన్నికల గురించి దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల ఇన్‌చార్జి జహంగీర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి వాసుగౌడ్ పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని కామాక్షిపురం కాలనీకి చెందిన సునేహ తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. ఈ మేరకు నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించేందుకు అవసరమయ్యే రూ.85 వేలను కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేయించి మంగళవారం సునేహ కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పథకాన్ని పేదలు, మధ్య తరగతి ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చలాన్ల పేరుతో వేధిస్తున్నారని ఫిర్యాదు



ట్రాఫిక్ ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

రామంతాపూర్: ఉప్పల్ సర్కిల్ పరిధిలోని ట్రాఫిక్ పోలీసులు చలాన్ల పేరుతో తీవ్రంగా వేధింపులకు గురి చేస్తున్నారంటూ మంగళవారం తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతినిధులు ఉప్పల్ ట్రాఫిక్ ఏసీపీ ఎం.వి. శ్రీనివాస్‌కు మంగళవారం వినతిపత్రం సమర్పించారు. కాంట్రాక్టు క్యారేజీ బస్సులకు ట్రాఫిక్ పర్మిషన్ అవసరం లేదని, అదేవిధంగా ఒక్కో సీటుకు రూ.1,120 టాక్స్ కట్టినా పోలీసులు వేధిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు కొండల్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, నరసింహారెడ్డి, నవాజ్, చక్రవర్తి, జంగయ్య, వెంకటేష్, అశ్విన్‌రెడ్డి, హరీష్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

8 రోజులు.. 1020 ఈ-పెట్టీ కేసులు

సనత్‌నగర్: గడిచిన వారం రోజుల్లో నార్త్ జోన్ పరిధిలో 1020 ఈ–పెట్టీ కేసులు నమోదైనట్లు డీసీపీ రోహిణి ప్రియదర్శిని తెలిపారు. బేగంపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత వారం రోజుల్లో 1020 ఈపెట్టీ కేసులు నమోదు కాగా, కోర్టు ద్వారా 381 కేసులు పరిష్కారం జరిగాయన్నారు. ఇందులో ఆరుగురికి జైలు శిక్ష పడగా, 320 మందికి జరిమానా విధించినట్లు తెలిపారు.

వృద్ధులకు చేయూత



వృద్ధులకు అన్నదానం చేస్తున్న లక్ష్మి దంపతులు

గౌతంనగర్: ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలని కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి సర్కిల్ బీ-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అన్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా గౌతంనగర్ డివిజన్ సంతోష్‌నగర్‌కు చెందిన దంత వైద్యురాలు లక్ష్మి, రాజు ముదిరాజ్ దంపతుల ఆధ్వర్యంలో మంగళవారం మిర్జాల్‌గూడలోని సెయింట్ ఆంథోని వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం, పండ్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పీవీ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

తాగునీటి లీకేజీకి శాశ్వత మరమ్మతులు చేపట్టాలి



హబ్సిగూడ వీధి నంబర్-1లో నేలపాలవుతున్న తాగునీరు

రామంతాపూర్: హబ్సిగూడ వీధి నంబర్–1 సాయిబాబా గుడి కమాన్ ఎదురుగా రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా ప్రారంభం కాగానే పైప్‌లైన్‌లో లీకేజీ పెద్ద ఎత్తున తాగునీరు నేలపాలవుతోందని స్థానికుడు గ్యార ఉపేందర్ ఆవేదన చెందారు. ఓ వైపు ప్రభుత్వం తాగునీటిని పొదుపుగా వాడాలని సూచనలు ఇస్తుంటే మరోవైపు జలమండలి అధికారుల నిర్లక్ష్యం కారణంగా తాగునీరు నేలపాలు కావడం దారుణమన్నారు. ఈ విషయాన్ని జలమండలి అధికారుల దృష్టికి తెచ్చిన ప్రతిసారీ తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారే తప్ప శాశ్వతంగా మరమ్మతులు చేపట్టడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

ఎమర్జింగ్ టెక్నాలజీపై అవగాహన అవసరం



జాతీయ సదస్సులో విద్యార్థులు, అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: ఇంజినీరింగ్ విద్యార్థులు, అధ్యాపకులకు ఎమర్జింగ్ టెక్నాలజీస్‌పై అవగాహన ఎంతో అవసరమని జేఎన్‌టీయూహెచ్ సీఎస్‌ఈ హెచ్‌ఓడీ సుప్రీతి అన్నారు. గుండ్లపోచంలపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం కార్పొరేట్ రంగంలో డిజిటల్ మార్కెటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి టెక్నాలజీస్ సమాజంలోని మనిషి మేధస్సు పెంపొందించడంలో, సైబర్ నేరాల నుంచి జీవితాలకు భద్రత కల్పించడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయిని తెలిపారు. కళాశాల సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్ మాట్లాడుతూ జాతీయ సదస్సులో నూతన సాంకేతికతపై అవగాహన కల్పించేందుకు ఎంతో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోకనాథం, కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, డీన్ రామసుబ్బారెడ్డి, హెచ్‌ఓడీ సుజిత్, కన్వీనర్ దిలీప్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్వాల్‌లో ఈటల రాజేందర్ రోడ్ షో



అల్వాల్‌లో రోడ్‌షోలో ఈటల రాజేందర్



మద్దతుగా ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

అల్వాల్: బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్ మంగళవారం అల్వాల్ సర్కిల్ పరిధిలో భారీ రోడ్‌షో నిర్వహించారు. ఏడు గుళ్ల వద్ద అమ్మవారిని దర్శించుకొని రోడ్‌షో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ అభ్యున్నతి కోసం 140 కోట్ల ప్రజల అభివృద్ధి కోసం మరోసారి నరేంద్రమోదీని ప్రధానమంత్రి చేయాలని కోరారు. మల్కాజిగిరి అభివృద్ధి కోసం తనను ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్‌రాజ్, మల్లిఖార్జున్‌గౌడ్, వెంకటేష్, అజయ్‌రెడ్డి, భానుప్రకాష్, మాణిక్యరెడ్డి, మల్లిఖార్జున్‌యాదవ్, మురళీ, వినయ్, శంకర్, సుజాత, మోయి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలోకి గణేష్ ముదిరాజ్

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్‌కు చెందిన కాంటెస్టెడ్ కార్పొరేటర్ గణేష్ ముదిరాజ్ తిరిగి తన సొంతగూటికి చేరుకున్నారు. మంగళవారం బీజేపీ మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి ఈటల రాజేందర్ సమక్షంలో ఆయన పార్టీ కండువా కప్పుకొని బీజేపీలో చేరారు.

2016లో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్‌గా మాజీ మేయర్ బొంతు రాంమోహన్‌పై బీజేపీ నుంచి పోటీ చేసి ఓటమిపాలయ్యాడు. తరువాత జరిగిన ఎన్నికల సమయంలో బొంతు రాంమోహన్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కానీ పార్టీలో ఇష్టంగా కొనసాగలేకపోయారు. ఈ క్రమంలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఈటల రాజేందర్ మల్కాజిగిరి నుంచి బరిలో దిగడంతో ఆయన అభ్యర్థన మేరకు తిరిగి బీజేపీలో చేరారు.

మోదీతోనే అభివృద్ధి సాధ్యం

మల్కాజిగిరి: మోదీతోనే దేశంలో అభివృద్ధి సాధ్యమని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. మంగళవారం మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్‌కు మద్దతుగా భగత్‌సింగ్‌నగర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ పది సంవత్సరాల మోదీ పాలనలో దేశం ప్రపంచ దేశాల్లో ప్రముఖంగా ఉండేలా చేశారన్నారు. కరోనా సమయంలో దేశ ప్రజల ప్రాణాలు కాపాడటంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చారని, మరోమారు మోదీ అధికారంలోకి వస్తే అఖండ భారత్ సాధించడం ఖాయమన్నారు. ప్రచారంలో జిలాని, గోపి, సాయి, రజని, సంతోష్, సరిత తదితరులు ఉన్నారు.